క్లుప్తంగా

16న జిల్లా బాలుర సీనియర్ హాకీ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం జినరాజదస హాకీ స్టేడియంలో ఈ నెల 16న జిల్లా సీనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక జరుగుతుందని జిల్లా హాకీ కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1.1.1995 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకు రావాలని కోరారు.

అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలి



మాట్లాడుతూ ఏబీవీపీ నాయకులు

మదనపల్లె సిటీ : ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముతూ తల్లిదండ్రులు, విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి పూర్తిస్థాయిలో మెరుగు పరచాలని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : మండలంలోని పోతిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శుక్రవారం పోతిరెడ్డిగారిపల్లెకు చేరుకుని లక్ష్మీరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు సి.కె. యర్రమరెడ్డి, రామకొండారెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటసిద్దులు, కోర్బు సిద్దారెడ్డి, సైపుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి మహాభారత మహోత్సవం

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో ఈనెల 20 నుంచి మహాభారత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు వెంకటేష్, రామచంద్రనాయుడు తెలిపారు. 19న అంకుర్పారణ, నవగ్రహ కలశ రాధన,నవగ్రహ హోమం, గణపతిహోమం,ధ్వజారోహణంతో ప్రారంభమవుతుందన్నారు. 20 నుంచి ప్రముఖ భాగవతారిణి జ్యోత్స్న చేత హరికథ, రాత్రి నాటక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహాభారత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గంగమ్మకు రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె సిటీ : స్థానిక కోర్టు ఆవరణంలోని కోర్టులో గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నిమ్మకాయలతో దీపాలు పెట్టి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, బీ.కె.పల్లి భక్తాదులు పాల్గొన్నారు.

గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి

కలికిరి : గోరక్షణ చట్టాలనిను కఠినంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా గోరక్ష ప్రముఖ్ హరిప్రతాప్‌రాజు కలికిరి పోలీసులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భారత సంప్రదాయం ప్రకారం గోమాతను ప్రతి రోజు పూజించే బావించే దేశంలో గోవుల అక్రమ రవాణా, వధ జరుగడం దారుణమని, గోరక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేసినా అమలు కాకపోవడం హాస్యాస్పదమని వినతిలో పేర్కొన్నారు. గోవధ విచ్చల విడిగా జరుగుతోందని, ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణా అడ్డుకోవాలని కోరారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధికి చెక్



వాల్మీకిపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



తంబళ్లపల్లె: వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ మునికుమార్

వాల్మీకిపురం : క్షయ వ్యాధి లేని సమాజ లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని ఎర్ర గుంట్లబావి గ్రామంలో శుక్రవారం ప్రజలకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వయోజన టీకా చాలా సురక్షితమైందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి సౌజన్య, వైద్య సిబ్బంది నిర్మల, సుజాత, శాంతమ్మ, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధికి అడ్డుకట్ట

తంబళ్లపల్లె : మండలంలో ముందస్తు చర్యలలో భాగంగా బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధికి అడ్డుకట్టవేసినట్లు అవుతుందని కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ మునికుమార్ తెలిపారు. నాలుగు వారాలుగా ప్రతి గురువారం ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 12 హెల్త్‌క్లినిక్‌ల పరిధిలో 2070 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- జెడ్పీహైస్కూల్‌లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ



స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె : చదువుతోనే ఉజ్వలభవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, ప్రతి ఒక్కరూ చదువుపై శ్రద్ధ కనపరిచి, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత సమాజాన్ని నిర్మించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. పీఎం పోషణ మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా విద్యార్థులు కూర్చొని భోజనం చేసేందుకు తన సొంత నిధులతో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. జెడ్పీ హైస్కూల్‌లో ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కోర్సులు ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శివప్రకాష్‌రెడ్డి, డీవైఈవో పురుషోత్తం, ఎంఈఓలు ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, షాజహాన్, శ్రీదేవి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా

వాల్మీకిపురం : వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు బి.అరుణ తెలిపారు. శుక్రవారం రాజీనామా ప త్రాలను మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్ రెడ్డి కి అందజేశారు. రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు.

డిపో ఆదాయం పెంచాలి



ఈపీకే పుస్తకాలు అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ సంస్థను కాపాడుకునేందుకు అందరూ కలిసి ఆదాయం పెంచాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఇటీవల డిపో నుంచి హైదరాబాదుకు మరో సర్వీసును ప్రారంభించినట్లు తెలిపారు. డిపోకు మరిన్ని కొత్త బస్సులు రానున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలన్నారు. ఈపీకె 40.00 రావాలని, కెఎంపిఎల్ 5.50 రావాలని సూచించారు. కండక్టర్లకు ఈపీకే పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి,ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్లబైలులో ప్రభుత్వస్థలాల ఆక్రమణ



ప్రభుత్వస్థలంలో అక్రమంగా వేసిన షెడ్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆనంద్‌రెడ్డి

మదనపల్లె : కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెరోడ్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని సర్పంచ్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కోళ్లబైలు పంచాయతీలో ప్రభుత్వస్థలాల్లో కొందరు షెడ్‌లు వేసి ఆక్రమిస్తున్నారన్న సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అక్రమాలను గుర్తించి, నిలిపివేయాల్సిందిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆనందరెడ్డి మాట్లాడుతూ...కోళ్లబైలు పంచాయతీలో ప్రభుత్వస్థలాలు అధికంగా ఉండటంతో ప్రతిరోజూ ఏదో ఒకచోట స్థానికేతరులు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులకు తెలిసే ఆక్రమణలు జరుగుతున్నాయని, లేఅవుట్లలో వసతుల కోసం కేటాయించిన కమ్యూనిటీ స్థలాలు అన్యాక్రాంతమైపోయాయన్నారు. తక్షణం ఆక్రమణలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

ములకలచెరువు : తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు, కదిరి రోడ్డుకు చెందిన పలువురు శుక్రవారం ఎంపీడీఓ పోలప్పకు వినతి పత్రం అందజేశారు. ఆరు నెలలుగా తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నామని మహిళలు కళావతి, ఆదినారాయణమ్మ, ఆయిషా, రంగమ్మ, మల్లమ్మ, సుజాత, రత్నమ్మ తదితరులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రజలకు హామీ ఇచ్చారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న వైద్యులు

మదనపల్లె సిటీ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని స్వస్థ ఆస్పత్రి ఆర్ఎంఓ ప్రియంవద అన్నారు. మదనపల్లె పట్టణం నక్కలదిన్నెలోని స్వాస్థ్య ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. వివిధ గ్రూపులకు సంబంధించిన రక్తం ఎప్పుడు ఎవరికి అవసరం అవుతుందో చెప్పలేమన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా రక్తం నిల్వ చేసి ఉంచితే ప్రాణపాయ పరిస్థితుల్లో ఉన్న వారిని కాపాడేందుకు వీలవుతుందన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలనికోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హార్సిలీహిల్స్ సభ్యులు రాజా, డాక్టర్ సతీష్‌రెడ్డి, పవన్, జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవుడికి విశేష పూజలు

రాయచోటి టౌన్ : యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం అష్టమి సందర్భంగా స్వామి వారికి పూజలు, అభిషేకాలు గావించారు. అనంతరం స్వామి వారి ఆలయంలో హోమం పూజలు జరిపారు. తరువాత స్వామి వారిని పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలతోపాటు అన్నప్రసాదం అందజేసినట్లు ఆలయ ధర్మకర్త ధర్మారెడ్డి తెలిపారు.

రాష్ట్ర విభజన హామీలను సాధించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

రాయచోటి అర్బన్ : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్రను పోషించిన టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను సాధించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఎల్.నరసింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ఘనవిజయం సాధించి కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో సైతం కీలక భూమిక పోషిస్తోందన్నారు. ఏపీకి 10 సంవత్సరాలు ప్రత్యేకహోదాను ఇస్తామని, విభజన హామీలు నెరవేరుస్తామని హామీయిచ్చిన ప్రధాని మోడీ ఆ తర్వాత విస్మరించారన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీని, విశాఖ రైల్వేజోన్ ప్రకటన, కడప స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం తదితర హామీలకు అతీగతిలేదన్నారు. కేంద్రప్రభుత్వం ఏర్పాటులో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లేనందున, టీడీపీ, జేడీయూ పార్టీలపై ఆధారపడిందని, ఈ పరిస్థితిని అనువుగా మార్చుకుని రాష్ట్రంలోని టీడీపీ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీల అమలును సాధించాలంటూ కోరారు. సమావేశంలో సీపీఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, రాయచోటి కార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్, సీపీఐ సీనియర్ నేత పలమనేరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

పుల్లంపేట : గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుల్లంపేట ఎస్ఐ రఘురాం హెచ్చరించారు. శుక్రవారం వత్తలూరు, అనంతసముద్రం గ్రామాలలో ప్రత్యేక బలగాలతో పర్యటించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని, ఒకరిపై ఒకరు కక్షసాధింపు చర్యలకు పాల్పడరాదన్నారు.

మల్లూరమ్మకు పాలాభిషేకం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసియున్న మల్లూరమ్మకు పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారికి పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు



సిద్దవటం : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం సీఐ మాట్లాడుతూ మండలంలోని డేగనవాండ్లపల్లె, టక్కోలి పెన్నానది పరివాహక ప్రాంతాల్లో చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు చెందిన ట్రాక్టర్‌ల యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు మాకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు. ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. పెన్నానదిలోకి వాహనాలు వెళ్లకుండా రహదారిని జేసీబీ యంత్రంతో తొలగిస్తామన్నారు. పెన్నానదికి చుట్టుపక్కల ఉన్న రైతులు, ప్రజలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బందికి సహకరించాలని ఆయన అన్నారు.

ఇసుక క్వారీ పరిశీలన

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలానికి మంజూరైన రెండు ఇసుక క్వారీలను శుక్రవారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. గతంలో నారాయణ నెల్లూరు, కోమంతరాజుపురం గ్రామాల వద్ద ఇసుక క్వారీని మంజూరు చేసి ఉన్నారు. ఇసుక తరలింపు నిలిపివేయడంతో ఆ క్వారీలను రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, భూగర్భ జల శాఖ, మైన్స్ శాఖలకు సంబంధించి అధికారులు పరిశీలించారు. క్వారీ నివేదికలు ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పీలేరు : ప్రభుత్వం నుంచి అనుమతి లేని ప్రైయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్ చేశారు. శుక్రవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కమీషనర్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో కొన్ని ప్రైయివేట్ పాఠశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నట్లు తెలిపారు. మొదటి, రెండో తరగతుల నుంచే ఒలంపియాడ్, ఐఐటీ పేర్లతో వేలాది రూపాయలు విద్యార్థుల నుంచి దండుకుంటున్నారని ఆరోపించారు. బుక్స్, యూనిఫాం, షూస్, బెల్ట్, టై లాంటి ప్రైయివేట్ స్కూళ్లలో అమ్మరాదని ప్రభుత్వం చెప్పినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ అరికట్టాలని కోరారు. పాఠశాల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో రక్తదాన శిబిరం



గుర్రంకొండలో రక్తదానం చేస్తున్న దాతలు

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా నిర్వహించిన శిబిరంలో 53 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. హెల్పింగ్ మైండ్స్ అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఆస్పత్రి బ్లడ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ భార్గవ్‌రెడ్డి ఆసంస్థ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రంకొండలో రక్తదాన శిబిరానికి మంచి స్పందన రావడం హర్షణీయమన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకురావాలన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. ప్రతి ఆరునెలల కొకమారు రక్తదానం చేయవచ్చన్నారు కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబుబకర్ సిద్దిక్, లెక్చరర్ జమీర్, పీడీ రమేష్, సంస్థ సభ్యులు మొకద్దర్, ఆబిద్, మహబూబ్ బాషా, నవాజ్, సాధిక్, ఫయాజ్, మిథున్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీ సిద్ధార్థ ప్రభంజనం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

మదనపల్లె : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్షల్లో శ్రీ సిద్ధార్థ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు మంచి ప్రతిభ కనపరిచి ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ ఈ.వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈఏపీసెట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన సి.జ్యోతివర్మ 1,727వ ర్యాంకుతో పట్టణంలో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. బైపీసీ విభాగంలో ఎస్.తౌసిఫ్ 4,526వ ర్యాంకు సాధించారన్నారు. తర్వాతి స్థానాల్లో బి.మోనిక 4,892, ఆర్.లహరి, 5188, ఏ.వినీల్‌కుమార్7,670, ఏ.బుష్రా అంజుమ్ 9,517 ర్యాంకులు సాధించారన్నారు. అలాగే జి.ఛరిష్మా 11,114, కే.తేజోమయి 11,310, రమ్యశ్రీ 12,136, కే.మహమ్మద్ రెహాన్ 14,695, ఉజ్మాఅంజుమ్ 15,104వ ర్యాంకు సాధించారు. ఇదేవిధంగా 10వేలలోపు ర్యాంకులు 6, 20వేలలోపు 21, 30వేలులోపు 30 మంది ర్యాంకులు సాధించారన్నారు. ఈఏపీసెట్–2024లో 324 మంది విద్యార్థులు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, అధ్యాపకబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

మదనపల్లెలో యోగాపై శిక్షణ

కురబలకోట : త్వరలో జరగనున్న యోగా డేని పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలోని ఎస్‌జీఓ హోంలో యోగాపై శిక్షణ ఇస్తున్నట్లు స్థానిక విశిష్ట నేచర్ క్యూర్ యోగా క్లీనిక్ నిర్వాహకులు డాక్టర్ బ్రహ్మ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు గంట పాటు ఈ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయన్నారు. యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక దృఢత్వాన్ని పొందవచ్చన్నారు. వ్యాధులు దరిచేరవచ్చన్నారు. ఒక వేళ ఉన్నా దూరం అవుతాయన్నారు. యోగా మనిషిని శక్తివంతం చేస్తుందన్నారు. రోజంతా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండడానికి బ్రహ్మాస్త్రమన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, పెద్దలు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 9515868030 సెల్ నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సమాజానికి భాష, సాహిత్యం పట్టుగొమ్మలు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

కురబలకోట : సమాజానికి భాష, సాహిత్యం పట్టుగొమ్మలని తమిళనాడు సేలంలోని పెరియార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సి. గోవింద్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంగ్లీషు, ఫారిన్ లాంగ్వేజెస్ విభాగం ఆధ్వర్యంలో భాష, సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భాష సాహిత్యం సంపద లాంటిదేనన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో ప్రపంచ స్థాయిలో రాణించాలంటే ఆంగ్లం తప్పనిసరిగా మారిందన్నారు. విదేశాల్లో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలంటే ఆ దేశ భాషపై పట్టు సాధించాలన్నారు. ఇందుకు తగిన స్కిల్స్ అవసరమన్నారు. విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహించాలన్నారు.

ఉర్దూ పాఠశాలల్లో అడ్మిషన్ల స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

సుండుపల్లె : రాష్ట్రంలో ఉర్దూ స్కూళ్లల్లో పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్ ఏ.ఎ.ఎం.ఓ (ఉర్దూ) సమీవుల్లా ఖాన్, షేక్ మహ్మద్ హాషీం ప్రత్యేకంగా సుండుపల్లె మండలంలో పలు ఉన్నత పాఠశాలలు సందర్శించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఉర్దూ స్కూళ్లలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగాలని సూచించారు. అనంతరం వారు పలు పాఠశాలలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ తిమ్మసముద్రం, మడితాడు ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరిపుల్లా, అబిదుల్లా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారికి భక్తులు రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజలలో స్థానిక భక్తులతోపాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

చిట్వేలి : మండల పరిధిలో నిర్మితమవుతున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి పాత కడప వాస్తవ్యులు మద్దిక శ్రీకాంత్ రెడ్డి, సతీమణి సునందలు శుక్రవారం రూ.5,00,116లు ఆలయ ధర్మకర్త కట్టా రామమోహన్ నాయుడుకు అందజేశారు. కె.కందులవారిపల్లి పంచాయతీ పరిధిలో కంబారాయుడు స్వామి గుడి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆలయానికి విరాళం అందించారు.